

# ఒక సామూహిక మరణదండన

గోపరాజు నారాయణరావు

నూలుతాడు. పందిరిదూలం నుంచి, లోపల పడుకున్న మనిషి గుండెలకు కాస్త పైవరకూ వేలాడుతోంది - చచ్చిన పాములా. జానెడు దూరానికో ముడి వంతున కొంతమేర ముళ్లు, తాడుకి. బాగా బిగిసి, చేతుల స్పర్శవల్ల ముడులు నున్నటి, నల్లటి బుడిపెల్లా మారిపోయాయి.

ఈ గంటలో అలా వాళ్ల కంటపడిన వాటిలో ఆరోదో, ఏడోదో!

వీథిలో వినిపించిన మాటలకి కాబోలు, ఊరేగింపు చూడ్డానికి ఆత్రపడే పిల్లాడిలా ఆ మంచం లాంటి దాని మీద పడుకుని ఉన్న వ్యక్తి లేచే ప్రయత్నం ప్రారంభించాడు.

ముందు తాడు అందుకున్నాడు. ఎంతో అలవాటుగా కొసన కాస్త పెద్దగా ఉన్న ముడిని కుడిచేతి గుప్పెట బిగించి పట్టుకున్నాడు. తరువాత ఎడంచేతితో దానిపై ముడిని పట్టుకున్నాడు. కొండలెక్కేవాళ్లు శక్తియుక్తులన్నీ ఒడ్డి తాడు పట్టుకుని పైకి ఎక్కుతున్నట్టు అతని రెండు చేతులూ ఒక దాని తరువాత ఒకటి ఆ ముడులని అందుకుంటున్నాయి.

కటి ప్రదేశం నుంచి తల వరకు ఒకే కోణంలో లేస్తున్నది శరీరం- గుర్తుపెట్టి వంచుతున్న ఇనుప చువ్వలా.

"అమ్మ... అమ్మ... అమ్మ... అయ్యో... ఊ..."

మూలుగుతూ లేస్తున్నాడతడు. ఈ కసరత్తుకు కాబోలు కాళ్లు వణుకుతున్నాయి. శరీరాన్ని మంచం మీద నిటారుగా కూర్చోబెట్టడానికి తాడు మీద నాలుగో ముడికో, ఐదో ముడి మీదకో వెళ్లింది చేయి. దాంతో శరీరమంతా కంపిస్తోంది.

అంత ప్రయత్నం మీద లేవగలిగాడు. కాళ్లు రెండూ సరిగ్గా మంచం దగ్గరే పెట్టుకున్న వాకర్ మధ్య పెట్టాడు, అలవాటుగా.

వాకర్ మీద రెండు చేతులూ ఆన్చి, బయటకు చూశాడు. ముందు కనుగుడ్లు, తరువాత మెడ నుంచి మొలవరకు నడ్డి వీథి వైపు తిరిగాయి.

"ఏం చంద్రయ్యగారూ! మంచిగున్నావా?"

ఆ మొండిగోడల మధ్య నుంచి లోపలికి అడుగు పెడుతూ ఎంతో చనువుగా అన్నాడు సుభాష్.

"ఏం మంచిలే... నీ కాల్మొక్తా. గోలీలేమైనిస్తవా!" సెకను కూడా ఆలస్యం లేకుండా వచ్చింది అతని నోటి నుంచి.

సుభాష్ వెనుకే ప్రవేశించారు ఆ ఇద్దరూ. వస్తూనే చంద్రయ్యకు అటొకరు, ఇటొకరు నిలబడ్డారు.

"నేను గోలీలిస్తే ఛస్తవ్!" నవ్వుతూ అన్నాడు సుభాష్, ఆ ఇద్దరినీ చూస్తూ.

"ఛస్తే పున్నెమే కదా!" ఠకీమని అన్నాడా వ్యక్తి, జీవంలేని నవ్వు నవ్వుతూ.

తుదిశ్వాసను ఆహ్వానిస్తూ బతుకుతున్న మనిషి. చచ్చిపోవడానికి కూడా కదల్లేని మనిషి పాపం.

"సారూ! ఈయన సలువోజు చంద్రయ్య. ఈ సార్లు హైదరాబాద్‌లో డాక్టర్లు. మిమ్మల్ని చూడ్డానికి వచ్చిన్రు!" అన్నాడు సుభాష్, చంద్రయ్యతో.

"సుభాష్ గోలీలు బాగా అలవాటు చేసిండు!" నవ్వుతూ అన్నారు డాక్టర్ శేఖర్, డాక్టర్ రాజారెడ్డిగారితో.

గోలీలంటే పెయిన్ కిల్లర్‌లే. నిజమే వాళ్ల బాధ అలాంటిది.

అది అంటువ్యాధి కాదు. కాని ఏ కుష్ఠురోగినో, ఎయిడ్స్ బాధితుడినో దూరంగా ఉంచినట్టు ఇలా పందిళ్లు వేసి అందులో ఉంచుతున్నారు. మనసు బండబారని వాళ్లు ఇళ్లలో ఒక మూల ఉంచుతున్నారు. మొత్తంగా అర్థమవుతున్నది ఈ రోగులను తమ మధ్య ఉంచుకోవడానికి ఇక్కడి మనుషులు సిద్ధంగాలేరు.

చంద్రయ్య ఫ్లోరోసిస్ బాధితుడు. స్కెలిటల్ ఫ్లోరోసిస్. ఫ్లోరోసిస్ వ్యాధిలో పరాకాష్ఠ.

చుట్టూ చూశారు డాక్టర్ శేఖర్. పడిపోయిన పాత ఇంటిలో సగం ఇంటి బాపతు మట్టిగోడలు, వాటికి చాలాచోట్ల సున్నపుపెచ్చులు ఊడిపోయి, మట్టి నల్లగా కనిపిస్తోంది. ఇంకా మిగిలి ఉన్న సున్నం మీద వర్షానికి కరిగి జారిన మట్టిచారలు కనిపిస్తున్నాయి. లోపల పందికొక్కులు తవ్విపోసినట్టు ఎగుడుదిగుళ్లు, నేలంతా.

నిరుడు కురిసిన భారీవర్షానికి పాత ఇల్లు కూలి పోతే ఈమధ్యే రేకుల షెడ్ వేసుకున్నారు, అదే స్థలంలో ఒక పక్కగా. ఆ షెడ్‌కి పక్కనే ఉందీ పందిరి, లేదా కొంజ. ఆరూ ఇంటూ ఆరు, లేదంటే ఏడూ ఇంటూ ఏడు ఉన్న తాటాకుల వాలు పందిరి. అదే చంద్రయ్య నివాసం.

పాత తాటిపట్టెల బల్ల. దాని మీద డొక్కపీచు కూరిన సన్నటి పరుపు. పైన మాసి పోయిన దుప్పటి, చెల్లాచెదురుగా. తల దిక్కున రాయిలా ఉన్న దిండు. ఒక్కడే కూర్చుని ఉన్నాడు చంద్రయ్య. గులాబీరంగు గళ్ల తువాలు మొలకు చుట్టుకుని, పైన గుడ్డ బనీను వేసుకుని ఉన్నాడు. నల్లటి దేహం. పక్కటెముకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జుట్టంతా వూడిపోయి ఉంది. కాళ్లు వాచి, బూడిద రంగులో ఉన్నాయి. వయసు యాభైలోపే. కాని డెబ్బయ్యేళ్లవాడిలా కనిపిస్తున్నాడు.

డాక్టర్ రాజారెడ్డి చంద్రయ్య మెడ మీద చెయ్యేసి వెన్నెముక పైనుంచి కింది దాకా నొక్కారు. అందుకు బలమంతా ఉపయోగించారు. అయినా చంద్రయ్య ఏమీ మాట్లాడలేదు. అలా రెండు మూడుసార్లు నొక్కి చూశారాయన.

“ఇదొక్కటి శేఖర్! ఈ శాపమిస్తూ దేవుడు ఇచ్చే వరం! ఎంత నొక్కు. నొప్పి అన్న మాటరాదు,” అన్నారా యన, ఇంగ్లీషులో.

అవే లక్షణాలు. మెడ మొదలుకొని మొండె మంతా తుప్పట్టిన యంత్రంలో భాగాల్లా బిగుసుకు పోయి కదలడం లేదు. తల అంగుళం కూడా పైకి లేవదు. కట్టెలా బిగుసుకుపోయిన శరీరం. కాళ్లలో సత్తువ లేదు.

“ఔ న్నార్!” అన్నారు డాక్టర్ శేఖర్. రాజారెడ్డి దగ్గర జూనియర్.

డాక్టర్ రాజారెడ్డి చెయ్యి పిరుదుల దగ్గరికి వెళ్లి నపుడు ఆయన మొహంలో చిన్న నవ్వు.

అది ఎందుకో డాక్టర్ శేఖర్‌కి తెలుసు. డాక్టర్ రాజారెడ్డి ఈ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆ సంగతిని ఒక జోక్‌లా చెబుతూ ఉంటారు. స్పైనల్‌కి అనస్థీషియా ఇస్తుంటే ఇంజెక్షన్ నీడిల్ విరిగిపోతూ ఉంటుంది- చాలా కొద్దిమందికి. అప్పుడు హైదరాబాద్ డాక్టర్‌లు అడిగే ప్రశ్న ఒక్కటే - ‘నల్గొండ జిల్లా మీది?’ అని. అదే గుర్తుకు వచ్చింది డాక్టర్ రాజారెడ్డికి.

చంద్రయ్య కింది పెదవిని తర్జనితో చుబుకం వరకు లాగి పళ్ల కేసి కూడా చూశారు రాజారెడ్డి. డాక్టర్ శేఖర్ కూడా ఎంతో ఆసక్తిగా గమనించారు.

ఇంటర్మీడియట్‌లో డిసెక్ట్ చేసిన వానపాము గుర్తొచ్చింది డాక్టర్ శేఖర్‌కి, చంద్రయ్య చిగుళ్లూ వాటిపై లాలాజలం చూస్తుంటే. ఈ చిగుళ్ల పొడవునా కొరుకుడు పడని పెద్ద వక్కపొడి పలుకుల్లా రూపురేఖల్లేని దంతాలు, పళ్లు. కొన్ని ముక్కుపొడుం రంగు దాటి బొగ్గు ముక్కల్లా కనిపిస్తున్నాయి.

“ఎప్పుడు పడిపోయినావ్, చంద్రయ్యా!” అడి గారు రాజారెడ్డి, మెడని మునివేళ్లతో పరీక్షిస్తూనే.

“ఏడాదైతుంది సారు!” అన్నాడు చంద్రయ్య, మెడ అతికష్టం మీద తిప్పి రాజారెడ్డి వైపు చూస్తూ.

‘పడిపోవడం’ అంటే ఇలా మంచానికి పరిమిత మైపోవడం. చంద్రయ్య కేసి జాలిగా చూశారు డాక్టర్ శేఖర్. చంద్రయ్య ఆరేళ్లో, ఏడేళ్లో బతుకుతాడు- వెర్రి నీరసంతో, కీళ్ల నొప్పులతో, రక్తప్రసరణలో లోపాలతో, ఉదరవ్యాధులతో, కిడ్నీలు పాడయ్యే వరకూ. ‘పడ్డోల్లు లేచేది లేదు’ పదిళ్ల అవతల ఇంత క్రితమే ఫాతిమా అనే గృహిణి అన్న మాటలు గుర్తుకువచ్చాయి డాక్టర్ శేఖర్‌కి.

చంద్రయ్య ఇక మంచం దిగలేడన్న వాస్తవం వైద్యశాస్త్రం, ఇంతకు ముందు చూసిన ఇలాంటి ఎన్నో కేసులు డాక్టర్ శేఖర్‌కు చెబుతున్నా, ఆ వాస్తవాన్ని ఒక రాశిస్థాయిలో చూస్తుంటే జీర్ణించుకోవడం కష్టంగానే ఉంది.

డాక్టర్ శేఖర్ ఈ మధ్యే స్టేట్స్‌లో వైద్యవృత్తి మానేసి ఇండియా వచ్చేశారు. ఆశ్చర్యం కలిగినా ఇది నిజం- తన పల్లెకు, దాని చుట్టుపక్కల పల్లెలకు సేవ చేయాలనే ఆయన ఆశయం. కాని పల్లెల్లో పరిస్థితులు

వేరుగా ఉన్నాయి. దాంతో కుటుంబసభ్యుల సలహా మీద హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు డాక్టర్ శేఖర్. అక్కడ ఐసియు ఇన్‌చార్జి. ఆ ఆస్పత్రిలోనే న్యూరోసర్జన్ డాక్టర్ రాజారెడ్డి. నిజానికి గాంధీ మెడికల్ కాలేజీలో చదివినపుడు డాక్టర్ శేఖర్ డాక్టర్ రాజారెడ్డి శిష్యుడు కూడా. తను ప్రాక్టీసు ప్రారంభించిన తరువాత అనుకోకుండా ఫ్లోరోసిస్ వ్యాధి గురించి తెలుసుకున్నారు రాజారెడ్డి. అప్పటి నుంచి, అంటే మూడు దశాబ్దాల నుంచి దానిమీద నిరంతరం అధ్యయనం చేస్తూనే ఉన్నారు. నల్లగొండ, ప్రకాశం జిల్లాలలో ఎన్నో ఊళ్లు తిరిగారు రాజారెడ్డి. ఈ వ్యాధి మీద నిరంతర అధ్యయనం, అంతర్జాతీయ మాగ్జయిన్లకి వ్యాసాలు రాయడం ఏడు పదుల వయసులో కూడా ఎంతో ఓపికగా చేస్తూ ఉంటారు. ఇద్దరు డాక్టర్లు అనుకుని ఈ రోజు నల్లగొండ జిల్లా నడిబొడ్డున ఉన్న వట్టిపల్లి వచ్చారు.

జిల్లాలో ఫ్లోరోసిస్ బాధిత ప్రాంతాలని, అక్కడి రోగులని బాగా ఎరిగిన మనిషి సుభాష్. నల్లగొండ ఫ్లోరోసిస్ విముక్తి సమితిని నిర్వహిస్తున్నాడు. పూర్తి సమయం కేటాయించి వాళ్లకోసం పోరాడుతున్నవాడు.

ఉదయం పదకొండు ప్రాంతం. ఎండ కాస్త జోరుగానే ఉంది. జేబులో తెల్లటి కర్చీఫ్ తీసి తుడుచుకుంటూ అడిగారు డాక్టర్ రాజారెడ్డి, "అన్నం తిన్నావా?"

"తిన్నా సారు," అన్నాడు చంద్రయ్య.

"కొంచెం బలమైన తిండి తినాల. ఏం కాదులే, మళ్లీ లేస్తవ్. కూరలు, ఆకు కూరలు తినాలె. పాలు తాగాలె," అన్నారు డాక్టర్ శేఖర్, చంద్రయ్య భుజం తడుతూ.

"ఏం తింటారు సార్! వీనికి ఇద్దరు కొడుకులు. ఎవ్వరు పట్టించుకోరు. ఇదిగో, పెద్దకోడలే ఏదో ఏలకి ఇంత బువ్వ పెడ్తుంది," అన్నాడు.

అప్పుడే లోపలి నుంచి ఒక మహిళ రెండు పాత గాద్రెజ్ చైర్లు పట్టుకొచ్చి వేయబోతే వద్దన్నారు డాక్టర్లు. ఆమె పెద్దకోడలు కాబోలు. ఆమె వెంట వచ్చాడు ఒక కుర్రవాడు, మూడో ఆసనంగా ఒక స్టూలు పట్టుకుని. అప్పుడే సుభాష్‌ను చూసి నవ్వాడు, పళ్లన్నీ కనిపించేటట్టు.

వెంటనే రాజారెడ్డి సైగ చేశారు. చూశానన్నట్టు తల ఊపారు డాక్టర్ శేఖర్.

లేతపసుపు రంగు పళ్లు, పచ్చి మొక్కజొన్నకండె మీద గింజల రంగులో.

డాక్టర్ శేఖర్ కళ్లలో అంతక్రితమే ప్రైమరీ స్కూలు గ్రౌండ్‌లో చూసినన దృశ్యం కదలాడింది, వెంటనే.....

"అబ్జర్వ్‌చెయ్! పళ్లు పచ్చబడని బోయ్‌నో, గాళ్‌నో నువ్వు పట్టుకోలేవు," బాధతోనే అయినా దృఢంగా అన్నారు డాక్టర్ రాజారెడ్డి, ఆ చిన్న గ్రౌండ్‌లోకి నడుస్తూ.

టక్ చేసుకుని అంత టిప్‌టాప్‌గా వస్తున్న ఆ ఇద్దరు ఆగంతకులని చూసి అప్పటిదాకా అక్కడ కేరింతలు కొడుతున్న పిల్లలంతా మౌనం దాల్చారు. రెండు మూడు క్లాసుల పిల్లలు సందడి చేస్తూ, ఆడుకుంటున్నారు.

"అరెయ్ బాబూ! మీ పళ్లు సూపియండ్రా!" అన్నాడు సుభాష్.

డాక్టర్లను చూసి నోళ్లు మూసుకున్న పిల్లలు, ఈ మాటకి పెదాలు కూడా బిగించేశారు.

"డాక్టర్ సాబ్‌లురా! అరే! ఒక్కసారి పళ్లు చూపండ్రీ!" అన్నాడు సుభాష్ మందలిస్తున్నట్టు. అప్పుడు వరసగా ఒక్కొక్కళ్లు నోళ్లు తెరిచారు. ఎనామిల్ చక్కగా ఉన్న పిల్ల లేదా పిల్లాడు ఒక్కరు కూడా లేరు. ఎక్కువ ఛాయలోనో, లేదా తక్కువో- అందరి పళ్లు పసుపురంగే.

అది ఫ్లోరోసిస్ తొలిదశ అన్న స్పృహ కలగగానే ఎవరో కొరడాతో ఛెళ్లుమనిపించినట్టయింది డాక్టర్ శేఖర్‌కి.

గంట మోగింది. అదే సందనుకుని క్లాసులలోకి పరిగెత్తుకుపోయారు వాళ్లంతా...

చంద్రయ్యకు వీడ్కోలు చెప్పి డాక్టర్లు బయటకు వచ్చారు. వెంట సుభాష్.

రెండు లిప్తల తరువాత వెనకాల నుంచి చంద్రయ్య పిలుపు, నీరసపు గొంతుతో, "సుబాశు, ఓ మాట."

"నే మల్లొస్తాగదా!" అనునయంగా అన్నాడు సుభాష్.

"ఒక్కమాట బిడ్డా! ఒక్కమాట," కూలిన ఆ మట్టి గోడల మధ్య నుంచి మళ్లీ పిలిచాడతడు. గొంతునిండా దైన్యం.

'మల్లొస్తాగా!' అన్నట్టు ఈసారి చేత్తోనో సైగ మాత్రం చేసి డాక్టర్లతో ముందుకు కదిలాడు సుభాష్.

"నడవండి సార్! వేరేం పని కాద్సార్. వీళ్లతో మాటాడేటోల్లు ఉండరు. ఎవరొస్తారా? నాలుగు కబుర్లు చెప్పుకుందామా! అని ఎదురు చూస్తంటారు సార్!" అంటూ డాక్టర్లకు సందేహనివృత్తి కూడా చేశాడు.

ఎండ చిటపటలాడిస్తోంది. తెలంగాణ పల్లెకు దర్పణం పడుతోంది- వట్టిపల్లి. పాత కొత్త ఇళ్ల మధ్య సన్నటి బాటలో ముగ్గురూ నడుస్తున్నారు.

''నిజాం ఉన్నా ఈపాటికి మాకు నీల్లిచ్చేవోడేనం టారు సార్ ఇక్కడ ముసలోల్లు. అప్పుడు ఇలా అవి టోల్లం అయ్యేటోల్లం కాదుకదా అంటార్సార్!'' అన్నాడు సుభాష్.

''అసలు నిజాంకాలంలో ఇంత దారుణంగా లేదు. నిజాం వైద్య సలహాదారు దేవర్ 1945లో నల్ల గొండ జిల్లాలో ఈ వ్యాధి పీడితులని గుర్తించాడు. ఇంత వికృతంగా కాళ్లూ చేతులూ వంకర్లుపోయిన వాళ్ల గురించి దేవర్ రిపోర్టులో లేనేలేదు,'' అన్నారు డాక్టర్ రాజారెడ్డి.

విస్తుపోయాడు సుభాష్.

నిజమే. స్కెలిటల్ ఫ్లోరోసిస్- వైద్య పరిభాషలో జెనువాల్గమ్- బాధితులను చూస్తుంటే గుండె పిండి నట్టవుతుంది. మొదటిసారి చూస్తే ఒళ్లు జలదరిస్తుంది. హాలీవుడ్ సినిమాలలో ఏలియన్ల అవయవాలు గుర్తుకు వస్తాయి. చెట్లకు అల్లుకుని అలాగే ఎండిపోయిన పాదుల కాండాల్లాంటి కాళ్లూ చేతులూ, ఫాంటసీ సినిమాలలో ఏదో ద్రావకం తాగించో, మరేదో మంత్రం వేస్తేనో అవయవాలు వంకర్లు తిరిగిపోయినట్టు ఎంత వికృతమో! వైకల్యాలు, వక్రతలు సృష్టిలో ఎన్నిరకాలో ఫ్లోరోసిస్ బాధితులని చూస్తే తెలుస్తుంది. పాతిక ముప్పయ్ సంవత్సరాల వయసువాళ్లు ఏడెనిమిది సంవత్సరాల పిల్లల్లా కనిపించడం మరొకటి.

అంతలో ''సుబాశూ! మా మందులెప్పుడొస్తయ్!'' వినిపించిందా పిలుపు.

నాలుగు దారులు కలిసిన చోటు. సరిగ్గా మధ్య లో రెండు వేపచెట్ల కింద ఉన్న రాళ్ల మీద కూర్చుని ఉన్నారు పది పన్నెండుమంది ఆడవాళ్లు. అందులో ఎవరో గట్టిగా అరిచారు, సుభాష్ కనిపించగానే.

సాయిబాబాలాగా రెండు చేతులు ఎత్తి ఆ సమూహం దగ్గరకు వెళుతూ అన్నాడు సుభాష్.

''వస్తయ్! వస్తయ్! తొందరపడితే యెట్ల?''

''ఎప్పుడూ! మేవంతా సచ్చినంకా!'' చేతులు విసురుగా తిప్పుతూ అంది ఇంకో నడివయసు స్త్రీ, కొంత కోపం, కొంత వ్యంగ్యంతో.

''సచ్చేముందు ఇల్లంతా డేకాలి, పాకాలి. ఆ సంగతి గుర్తులేదా? అన్నట్టు సుబాశూ! మొన్నట్నించి వడ్లోల్ల లచ్చమ్మ డేకెస్తంది తెల్సా! నీకు ఇంకో కేసు!'' ఇరవయ్యేళ్లుంటాయి ఆమెకి. అంత విషాదం గురించి అలవోకగా అంది. ఫ్లోరోసిస్ ముదిరితే మగాళ్లు మంచం దిగరు. ఆడవాళ్లు మాత్రం డేక్కుంటూనే ఇంటిపనంతా చేసుకోవాలి. పైగా 'ఇంకో కేసు' అన్నప్పుడు ఆడ వాళ్లంతా గట్టిగా నవ్వేశారు.

ఆ మెకాబ్రే సెటైర్‌కి మతిపోయింది డాక్టర్ శేఖర్‌కి.

అప్పుడే అటుగా వచ్చాడా వ్యక్తి. ఒక్కసారిగా నిశ్శబ్దం.

డాక్టర్లు తప్ప సుభాష్‌తోసహా అంతా ఆ వ్యక్తిని ఓ అద్భుతంలాగే చూశారు. అంతకంటే, చచ్చిపోయా డని అనుకున్న వ్యక్తి నడిచి వచ్చినంత విభ్రమంగా చూశారనాలి.

''శభాసు. నువ్వున్నా ఈరోవి.'' అన్నాడు అందరి కంటే ముందు మేల్కొన్న సుభాష్, హృదయ పూర్వ కంగా. వెంటనే డాక్టర్ల వైపు తిరిగి అన్నాడు- ''సారూ! ఈయన కట్టుకూరి నరసింహం. నీళ్లు మారితే ఈళ్లూ లేచి నడుస్తారని నిరూపించిన మనిషి.''

''ఆయనకేమి! పాడి లేదా!'' అందొక మహిళ.

అందరికీ డాక్టర్లని పరిచయం చేశాడు సుభాష్.

''ఇతనొక్కడికే మంచినీరేడది?'' అడిగారు డాక్టర్ శేఖర్ వింతగా, పక్కపక్కనే వున్న రాజారెడ్డి, సుభాష్‌లకి వినిపించేలా.

''కొనుక్కుంటాడు!'' అన్నారు డాక్టర్ రాజారెడ్డి.

''అది కూడా పాలు అమ్ముకుని సార్! కొంత మంది ఇట్లనే చేస్తున్రు'' మామూలుగా అన్నాడు సుభాష్.

పాలు అమ్ముకుని నీళ్లు కొనడమా? మరింత విస్తుపోయాడు డాక్టర్ శేఖర్.

''ఎండ బాగుంది సార్! ఆఫీసుకి ఎల్దాం!'' హఠాత్తుగా అని, ఆ దారిపట్టాడు సుభాష్. ఎండలో నడుస్తున్నారు ముగ్గురు.

వట్టిపల్లె మట్టిరోడ్డు మీద ముగ్గురూ నడుస్తు న్నారు. రెండవుతుంది టైము. రాజారెడ్డి గారి తెల్లటి జుట్టు ఎండలో మరింత మెరుస్తోంది. డాక్టర్ శేఖర్ పరధ్యానంగా అడుగులేస్తున్నారు. అసలే జబ్బు చేసిన ఊరు. ఆ ఎండవేళ మరింత మౌనంగా ఉంది.

''ఇంత బేకారు విలేజీ ఈ ప్రపంచంలోనే ఉండదు సార్! ఇండియాకి, పాకిస్తానోడికి యుద్ధంగా నొస్తే మొదటి బాంబు ఈ ఊరి మీదెయ్యమని బతి మాలుకుంటాను సార్! అంతా ఒక్కసారే సస్తం. శని ఇర గడయిపోతది. ఇక్కడ మొగోల్లు నడలేరు. ఆడోళ్లు

సుఖంగా బిడ్డల్ని కనలేరు. పడిపోతే పదేళ్లు మంచం మీదుండాలి, సావాకుండా, బతక్కుండా!

‘‘ఈ గవర్నమెంట్లు మాత్రం ఏంటి సార్! ఈ ఊళ్లకి ట్యాంకుల్లో నీళ్లిమ్మని హైకోర్టు చెప్పింది. చెయ్‌లా. హైద్రాబాద్‌కి పదకొండు నెలల్లో సాగర్ నీళ్లు పోయినయ్. మా ఊళ్లకెందుకు రావు? టౌన్లోను, సిటీల్లోను ఉండేటోల్లే మనుషులా? చంద్రబాబు పదడుగుల పైపేస్తే, రాజశేఖరెడ్డి పదకొండు అడుగులు పైపేయించిండు. ఇక్కడికి ఇరవై కిలోమీటర్లు కూడా లేదు సార్, పైపులైను. అంతదూరం పోయిన పైపు, పక్క నున్న ఈ గ్రామాలకెందుకు రాదు?

‘‘హైద్రాబాద్‌లో ఒక ఫ్యామిలీ పాకీదొడ్లో పోసే నీళ్లతో ఇక్కడ ముగ్గురు ఆరోగ్యంగా బతకుతారు సార్! ఐదుగురు ప్రధానమంత్రులని, ముగ్గురు రాష్ట్రపతుల్ని కలిసాం సార్! చుక్క నీరు రాలేదు. మేం సిమ్మింగ్ పూల్లకి, వాటర్ వరల్డులకి అడగడంలేదు సార్! కాల్లూ చేతులూ చచ్చుడిపోతన్న మనుషులు తాగడం కోసం నీళ్ల డుగుతున్నాం. కాని ఈ గవర్నమెంటు బిస్లెరీవాడికి, ఆక్వాగార్డువాడికి, కెన్లేవాడికి సీసాల్లో పోసి అమ్ము కుంటానికి ఐదు పైసలికి ఇరవై లీటర్ల నీళ్లు ఇస్తంది.

‘‘ఆ పొలాలు చూడండి సార్! పదెకరాల్లో 89, అచ్చరాలా 89 బోర్లేసినా నీళ్లు పడ్లేదు. అంతా వస్తరు. ఈ అవిటోళ్లతో ఫోటోలు దిగుతారు. పోతారు. మేం వింత జంతువులం సార్! అంతే....’’ అతడి ఆవేశం కొన సాగేదే గాని, ఎదురుగా నల్లగొండ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి కార్యాలయం కనిపించింది. తాళం కోసం జేబులు వెతుక్కుంటూ ఆపేశాడు.

రెండు లిప్తలకి తాళం తీసి లోపలికి ఆహ్వానిం చాడు సుభాష్.

కారు డ్రైవర్ గబగబ రెండు వాటర్ బాటిల్స్ తెచ్చి వారికిచ్చాడు. ముగ్గురూ తాగారు. ప్రాణం లేచి వచ్చి నట్టయింది.

కాసిని నీళ్లు చేతిలో పోసుకుని ముఖం కడుక్కుని జేబురుమాలుతో తుడుచుకుంటూ అక్కడే ఉన్న పాత చెక్కకుర్చీ మీద కూర్చుని, రిలాక్సింగ్‌గా కళ్లుమూశారు డాక్టర్ శేఖర్. డాక్టర్ రాజారెడ్డి పక్కనే ఉన్న బల్ల మీద కూర్చున్నారు.

చిన్న చెక్క షెల్ఫ్‌లోంచి ఒక లెటర్ తీసి రాజా రెడ్డికి చూపించాడు సుభాష్. ఈమధ్య నెదర్లాండ్స్ నుంచి వచ్చి, ఇక్కడి వాళ్లని చూసి వెళ్లిన ఒక సోషల్ వర్కర్ రాసిన ఉత్తరం అది. ఆమె పర్యటన విశేషాలు, ఇచ్చిన హామీల గురించి చెబుతున్నాడు సుభాష్.

ఈ దృశ్యాలన్నీ ఒక్క పూటలో చూసినవంటే చూసిన తనకే నమ్మకం కలగడం లేదు డాక్టర్ శేఖర్‌కి. కాళ్లు కదపలేని పురుషులు, మెడ తిప్పలేని మహిళలు, రోడ్డు మీద చతికిలపడినా కాలు విరిగిపోయిన లింగమ్మ, ఆటో మీద పడి వెన్నుపూస విరిగిపోయిన ముగ్గురు ఆడపిల్లల పేద తండ్రి, మనుషుల కోసం మొహం వాచిపోయిన చంద్రయ్యలు, కాళ్లూ, చేతులూ వంకర్లు తిరిగిపోయినా టెలిఫోన్ బూత్ పెట్టుకుని తల్లిదండ్రులని కూడా పోషిస్తున్న తిరుపతమ్మ, ఆ స్కూలు పిల్లలు.... మనోఫలకం మీద కదులుతూనే ఉన్నారు. ఇదంతా కొన్ని గంటల దృశ్యమాలిక అంటే ఎవరూ నమ్మకపోవచ్చు. కాని ఇది పచ్చినిజం. వాళ్లంతా కల్పిత కథలలోనో, ఫాంటసీ సినిమాలలోనో పాత్రలు కారు. రక్తమాంసాలున్న మనుషులు.

ఎప్పుడు పట్టిందో, చిన్న కునుకు పట్టింది డాక్టర్ శేఖర్‌కి.

ఆ మగతలో ఓ దృశ్యం-

బడి గంట మోగింది. ఇంత క్రితం చూసిన ఆ స్కూలే... పిల్లలంతా కేరింతలు కొడుతూ ఇళ్ల దారి పట్టారు. కాని పుస్తకాలూ, పలకలూ లేవు. వాళ్లందరి చేతులలోను నూలుతాళ్లు...

*నవ్య వారపత్రిక, 28 మార్చి 2007*